“వాడ్ని విడిపించమని నా మనుష్యులొస్తే వాడు పాత కేడీ, వాడే ఈ పని తప్పక చేసుంటాడని పొగరుగా అన్నావు. నీవు మర్చిపోయావేమో తెలీదు. కాని నీ చరిత్రలో నువ్వు రెండుసార్లు భారీ ఎత్తున లంచాలు తీసుకున్నావు”.

గౌసుద్దీన్ ఉలిక్కిపడ్డాడు రాజర్షి చెప్పింది విని.

“దటీజ్ మై నెట్ వర్క్. ఇప్పుడు చెప్పు పాత కేడీ మరో తప్పుడు పనిచేసే అవకాశం వున్నప్పుడు పాత అవినీతి అధికారి మరో అవినీతి పని చేయడని నమ్మకం ఏమిటి? ఇదీ సంబంధం?”

“యూ బాస్టర్డ్...” గౌసుద్దీన్ పళ్ళు పటపట కొరుకుతూ అన్నాడు పెద్దగా.

“ఇకపోతే...అర్జంట్‌గా ఆ రౌడీని వదిలెయ్యాలి. రెండు నా తోటను నాశనం చేసినందుకు పరిహారం చెల్లించాలి. తక్షణం ఈ రెండూ జరగలేదనుకో...”

“అనుకోవటం ఏమిటి? అసలు అనుకోవటానికి నువ్వెవడివి? జరగవు... ఏం చేస్తావ్?” రంకే వేసాడు గౌసుద్దీన్ .

“మీ డిపార్టుమెంటే అంత... పోలీసు డిపార్టుమెంట్‌లో చేరేవరకు మీ బుర్రలో గుజ్జుంటుంది. ఒకసారి నెత్తికి టోపి, చేతికి లాఠీవస్తే బుర్ర తరిగిపోయి బొజ్జ పెరిగిపోతుంది. లాజిక్కు తగ్గిపోయి లాలస పెరిగిపోతుంది. విచక్షణజ్ఞానం, ఇంగితజ్ఞానం తగ్గిపోయి వీరవిహారం పెరిగిపోతుంది. అధికారం, అహంకారం, ఒళ్ళు పొగరు ఎక్కువయి పోతాయి. మీకందరూ దొంగల్లాగే కనబడతారు. అసలు దొంగలు మీరు, చేనుని మేసే కంచెలు మీరు. జరక్కపోతే ఏమవుద్దన్నావ్ చూడు. ఏమీ అవదు లంచం తీసుకోబోయినందుకు ఇవ్వాళో రేపో సస్పెండ్ అవుతావ్. నా తోటను నాశనం చేసినందుకు ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకుంటావ్” తాపీగా అన్నాడు రాజర్షి.

“అందుకు సాక్ష్యం కావాలి...” గౌసుద్దీన్ అన్నాడు.

“సాక్ష్యం లేకుండానే మానెయ్యటానికి నేనేం తలకు మాసిన పోలీసోణ్ని కాదు తల వున్న సివిలోణ్ని. నీ వీరవిహారం మొత్తం పాపం నా వీడియో కెమెరా భద్రంగా తన కడుపులో దాచుకుంది. అర్థరాత్రి పూట కూడా నా ఆశ్రమం ముందు లైట్స్ ఎందుకు వెలిగే ఉన్నాయో ఇప్పుడర్థమవుతుందనుకుంటాను. అదీ...సంగతి”

రాజర్షి ఫోన్ పెట్టేశాడు. నరరూప రాక్షసుడులాంటి గౌసుద్దీన్‌కు చెమటలు పట్టేశాయి.

అంతే....పై సంఘటనతో రాజర్షి ఎవరు? ఏం చేస్తుంటాడు? ఎక్కడుంటాడన్నది ఒక్కసారి గుప్పున వెలుగులోకి వచ్చింది.

అదిగో అలాంటి రాజర్షిని ఆశ్రయించబోతున్నారిప్పుడు పట్టాభి మధుమూర్తులు....

“ఇప్పుడు ముందుగా మనం చేయాల్సింది. పరమశివం హఠాత్తుగా తన భాగస్వామ్యాన్ని రద్దు చేసుకున్నందువల్ల మన ఫర్మ్ దెబ్బతిందని పట్టాభి మధుమూర్తులకు చెప్పే గతని పేపర్స్‌కి ఎక్కించాలి. ఆ పేపర్ రాజర్షి ఆశ్రమానికెళ్ళేలా చేయాలి. ఆ తరువాత

ఏం జరగవల్సింది నేను నిర్ణయిస్తాను" పట్టాభి సీరియస్‌గా చెప్పాడు దుర్గాదాసుకి.

మధుమూర్తికి మొదటి నుంచి ఒకటే భయం. చేతబడి తిరగబడుతుందేమోనని.

దుర్గాదాసు పట్టాభి అందించిన డబ్బు తీసుకుని బయలుదేరాడు.

దుర్గాదాసు సరాసరి దినపత్రికల కార్యాలయాలకు వెళ్ళి పట్టాభి ఫరమ్ దెబ్బతిందని న్యూస్ ఇచ్చేశాడు. ఆ న్యూస్ మరుసటిరోజు పత్రికల్లో వచ్చేసింది.

"శభాష్.... ఈపాటికి రాజర్షి దినపత్రికలన్నీ తిరగేసి వుంటాడు" పట్టాభి హుషారుగా అన్నాడు దినపత్రికల్ని తిరగేస్తూ.

"నాకేమిటో భయంగా వుంది-- పరమశివం, శశిభూషణ్‌కి నష్టంకలిగించాలని చూస్తున్నావ్‌గాని ఈ వార్త పడిన తర్వాత మార్కెట్ బిజినెస్ సర్కిల్స్‌లో మన వ్యాపారం ఎంత దెబ్బతింటుందో అలోచించ లేదు" మధుమూర్తి దిగులుగా అన్నాడు.

పట్టాభి నవ్వాడు.... చిన్నగా మొదలెట్టి శృతి పెంచుతూ నవ్వుతూనే వున్నాడు కొద్ది క్షణాల వరకు.

ఉన్నట్టుండి సడన్‌గా ఆపేసి మధుమూర్తి వేపు చూశాడు "నిండా మునిగినవాడికి చలేమిటి మూర్తీ! దెబ్బతినాల్సినదేమన్నా మిగిలుందా? వ్రతం చెడ్డా ఫలితం దక్కాలి కదా? దొంగవ్యాపారాలు చేసుకునేవాడికెప్పుడూ ఎక్కువే మిగులుతుంది.
అలాగే అప్పుడప్పుడూ సడన్‌గా నష్టమూ వస్తుంటుంది. ముందు వాళ్ళను సర్వనాశనం చేసి అప్పుడు మన వ్యాపారం గురించి ఆలోచిద్దాం. మరింకేం నస పెట్టకు."

పట్టాభిమీద భారం వేసి మధుమూర్తి టెన్షన్ తగ్గించుకున్నాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే దుర్గాదాసు రాజర్షి ఆశ్రమంలో కూలీగా చేరాడు.

కొద్దిరోజులలోనే ఆశ్రమంలో మంచి గ్రిప్ సంపాదించుకున్నాడు.

నిజంగా మంచివాడనిపించుకొనేందుకు టైమ్ కావాలేమోగాని
కావాలని అవసరం వుండి మంచివాడనిపించుకోవాలనే చెడ్డవాడికి అంత టైం అక్కరలేదు. నటనలో ప్రావీణ్యం వుంటే చాలు.

ఓరోజు దుర్గాదాసు రాజర్షి కి కనిపించే స్థానంలో కూర్చుని విచారవదనంతో శూన్యంలోకి చూడసాగాడు. మరో అరగంటకల్లా పరమశివం, శశిభూషణ్ అనే ఇద్దరు స్వార్ధపరులైన వ్యక్తులు పట్టాభి, మధుమూర్తి అనే అమాయకుల్ని మోసంచేసి ముంచినట్లు-- అందువల్లనే తనకు ఉద్యోగం ఊడిపోయి ఆశ్రమం పంచ చేరినట్లు అతి జాగ్రత్తగా రంగు పులిమాడు దుర్గాదాసు.

అనుచరులకు అప్పుడు గుర్తుకొచ్చింది కొద్దిరోజుల క్రితం చదివిన వార్త. అదే విషయాన్ని తమ బాస్‌కి గుర్తు చేశారు.

అతను వెంటనే అ యిద్దరు వ్యక్తుల వివరాలు కావాలని ఆదేశించాడు.

అదేరోజు సాయంత్రానికి పరమశివం, శశిభూషణ్ కుటుంబాల వివరాలు, వారి అలవాట్లు, ఆస్థులు ఆశ్రమంలో రికార్డయి పోయాయి.

ఆ మరుసటిరోజు ఉదయమే అతని అనుచరులిద్దరూ రంగప్రవేశం చేశారు.

అనుచరుల రంగప్రవేశం వార్త దుర్గాదాసు ఎంతో జాగ్రత్తగా పట్టాభికి చేర్చాడు. చేర్చడంతో పాటు రాజర్షి ఉగ్రరూపం దాల్చడానికి అవసరమైనా ఉప్పులాంటి సూచనను కూడా అందించాడు....

దాని ప్రకారం రాజర్షి అనుచరులు పరమశివం, శశిభూషణ్‌ల అవమానానికి గురికావాలి.

పట్టాభి వెంటనే గతంలో పరమశివం, తాము కలిసి వున్నప్పుడు అందరికి మిత్రుడయిన ఒక వ్య క్తిని పిలిపించి అతని చేతిలో అయిదువేలు పెట్టాడు.

అప్పుడు చెప్పడం ప్రారంభించాడు పట్టాభి .

''ఇప్పుడు నువ్వు చేయవలసింది వాళ్ళిద్దరి మూడ్స్ అప్‌సెట్ చేయాలి. రాజర్షి అనుచరులు మా తరపున రాయబారానికి రాబోతున్నట్లు తెలియజేయాలి. రాయబారం సఫలీకృతం కాకపోతే బెదిరించటానికయినా వాళ్ళు సిద్ధంగా వున్నారు. అని వారిని ఆవేశపరుల్ని చేయాలి. మరో విషయం ఇది నీకై మాకు గతంలోవున్న స్నేహం పోయిందే అన్న బాధతో పరమశివం, శశిభూషణ్ క్షేమం పట్ల వర్రీ అవుతూ చెప్పినట్లుగా వుండాలి. ఆఖరిగా పట్టాభి, మధుమూర్తి దొంగవెధవలు. వాళ్ళ రాయబారాన్ని ఖాతరు చేయవద్దు అని చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పమని సలహా ఇవ్వు. అనుకుంది  అనుకున్నట్లు జరిగితే ఇంకో ఐదిస్తాం జాగ్రత్త....''

చేతిలోవున్న ఐదువేలు చూసుకుని అతని కళ్ళు మెరిస్తే రాబోయే ఐదువేలను తలచుకుని అతని మనసు ప్రలోభపడింది.

అతను మెంటల్‌గా  ప్రిపేర్ అవుతూ బయలుదేరాడు. సరిగ్గా అప్పుడే అనుచరులు రంగప్రవేశం చేశారు.

అక్కడ ఆశ్రమంలో దుర్గాదాసు ఇక్కడ పట్టాభి, మధుమూర్తి  ఆందోళనగా ఎదురు చూస్తుండగా పట్టాభి నియమించిన వ్య క్తి శశిభూషణ్ ఇంటిలోకి ప్రవేశించాడు.

అనుకోకుండా పరమశివం కూడా ఆ సమయంలో అక్కడే వుండటం ఆ వ్య క్తికి ఆనందం కలిగించింది.

ఆ వ్య క్తి పరామర్శలయ్యాక నిప్పులో ఉప్పువేయటం ప్రారంభించాడు.

అనుచరులు ముందుగా పరమశివం ఇంటికి వెళ్ళారు.

అతను శశిభూషణ్ ఇంటికెళ్ళినట్లు తెల్సుకుని అక్కడికే బయలుదేరారు వేగంగా.

సరిగ్గా అనుచరులు శశిభూషణ్ ఇంటికొచ్చేసరికి పట్టాభి పంపించిన వ్య క్తి తను తీసుకున్న డబ్బుకు న్యాయం చేకూర్చాడు.

రాజర్షి అనుచరులు పరమశివం, శశిభూషణ్‌ల నిరసనను మోసుకుని ఆశ్రమానికి బయలుదేరారు.

''సరిగ్గా పదోరోజుకు పని పూర్తయిపోతుంది. రాజర్షి నిర్ణయం తీసుకున్నాడు''

పట్టాభి ఆనందంగా అన్నాడు.

0 0 0

సరుగ్గా 4.30కి రాజర్షి ఉదయ్ స్కూల్ ముందువున్నాడు అప్పటికే అతని మెదడులో అద్భుతమైన పథకం ఒకటి రూపుదిద్దుకుంది.

దాన్నే నెమరు వేసుకుంటూ అతను ఉదయ్ రాకకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

రక్తపాతం, భీభత్సం, హింసలాంటి వాటితో పనిలేకుండా పరమశివం, శశిభూషణ్‌లు జీవితాంతం కుళ్ళికుళ్ళి ఏడ్చేలా రాజర్షి లాంటి మేధావి పథకంతో రంగంలోకి దిగాడని వారికింకా తెలియదు.

సరిగ్గా 4.30 స్కూల్ బెల్ మ్రోగింది. పిల్లలు ప్రవాహంలా బయటకు దూసుకొచ్చారు.

రాజర్షి పోలీసు జాగిలంలా ఉదయ్‌కోసం అన్వేషిస్తున్నాడు.

క్షణాలు..... నిమిషాలు--దొర్లిపోతున్నాయ్.

ఒకింత సేపు గుంపులు గుంపులుగా చేరి అల్లరి చేసుకున్నాక విడిపోవటం ప్రారంభించారు పిల్లలు.

ఉదయ్‌ని అప్పుడు గుర్తుపట్టాడు అతను. లేచి నెమ్మదిగా నడక ప్రారంభించాడు. అతని మెదడునిండా ఇప్పుడు చిన్న పిల్లల మనస్తత్వం గురించిన ఆలోచనలే చోటుచేసుకున్నాయి.

అరఫర్లాంగు నడిచేవరకూ రాజర్షి ఉదయ్ దృష్టిలో పడకుండా జాగ్రత్తపడుతూ అతన్నే పరిశీలించసాగాడు.

కేవలం అయిదారడుగుల దూరాన్ని మెయిన్‌టేన్ చేస్తూ.

హుషారయిన కుర్రాడు ఊరికే ఉద్రేకపడిపోయే మనస్తత్వం. అనవసరంగా మాటంటే పడని ఆత్మాభిమానం. ఆవేశమొస్తే అంతు చూసే పౌరుషం వీటన్నింటికి తోడు తెలుగు సినిమా హీరోలా సాధ్యమైనా, కాక పోయినా అన్నీ తనే చేయాలనుకునే డ్రీమర్. సన్నని చిరునవ్వు రాజర్షి పెదవులపై క్షణకాలం మెరిసి అదృశ్యమైంది.

0 0 0

పట్టాభికి ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా వుంది రాజర్షిని రంగంలోకి దింపగలిగినందుకు దుర్గాదాసుని ఆకాశానికెత్తివేస్తున్నాడు.

సరిగ్గా తొమ్మిదిరోజులలో శత్రునాశనం పరిసమాప్తం.

"ఊరికే అలా ఆనందపడిపోకు పట్టాభి. రాజర్షి రెండువేపులా పదునున్న కత్తిలాంటివాడు. ఓ వేపు

అటు కేసి నరుక్కొళుతుందని ఆనందపడిపోతూ ఆదమరిస్తే. ఈ వేపు మనకేసి నరుక్కుంటూ వస్తుంది" మధుమూర్తి మాటలో ఒకింత ఆందోళన స్పష్టమయింది.

పట్టాభి నవ్వాడు, విరగబడి నవ్వాడు.

"అందుకే మనం పిడి పట్టుకుటాం. అప్పుడు కత్తికి ఎదురు, ఎడమ, కుడివేపులా బలవుతారుకాని మనవేపు కాదు" పట్టాభి దిలాసాగా అన్నాడు.

"నువ్వు రాజకీయాల్లోకి వెళ్ళి వుండవలసింది బాగా వచ్చేవాడివి. ఎందుకంటే పరమలుచ్చాలు రాజకీయాల్లో బాగా రాణిస్తారని చరిత్ర చెబుతుంది."

పట్టాభి గుర్రుగా చూశాడు.

"కోపం తెచ్చుకోక. నేనన్నమాట గొప్ప క్వాలిఫికేషన్ క్రింద లెక్క. నువ్వు మామూలుగా వుంటే...ఊరా? పేరా? డబ్బా? అదే రాజకీయాల్లోకి వెళ్ళావనుకో-పదవి చేజిక్కించుకున్నావనుకో ఆయుధాల్లో కమిషన్స్-స్విస్‌లో నిల్వలు... లైసెన్స్‌ల కుప్పలు.

దేశాన్ని నంజుకు తినే వయస్సు.

పదవి పోయినప్పుడు ఒక రకంగా-

పదవి కోసం ఒకరకంగా-

పదవిని నిలబెట్టుకునేందుకు ఇంకో రకంగా--

పార్టీ పదిలం చేసుకునేందుకు వేరో రకంగా-నోటికొచ్చినట్లు వాగొచ్చు.

నువ్వు ఎంత మాట్లాడినా వేసుకునేందుకు పత్రికలుంటాయి. నమ్మేందుకు వెర్రిబాగుల ప్రజలుంటారు. అనుక్షణం అబద్ధాలు చెప్పగలగటం ఎంత అదృష్టం.

దేశభక్తి నాకే వుంది. మిగతావారికి లేదు అనొచ్చు. అది లేకపోతే అవి చేస్తాననొచ్చు అనుయాయులకు పదవులివ్వచ్చు. ప్రజాసేవకే పుట్టానని, ప్రజలకే నా జీవితం అంకితం అని మా పార్టీ పుట్టింది దేశాన్ని ఉద్ధరించటానికని, మాకు స్వార్థం లేదని-

మేం తినడం లేదని, ఫలానావాడే నియంత అని, ఫలానావాడికే ఎక్కువ వుందని, ఒక్కటేమిటి....ఎన్ని జోకులయినా వేయవచ్చు.

ఎన్ని అబద్ధాలయినా ఆడేయవచ్చు. ఉన్న పార్టీకి వెన్నుపోటు పొడిస్తే పక్కపార్టీ, డబ్బులేని పార్టీని పొడిగితే సీటు. ఈ దేశప్రజలు చైతన్యవంతులు కారు.

వెధవ మీటింగులు పెట్టినా గొర్రెల్లా వస్తారు చూశావా. మన దేశ జనాభాని ఫుట్‌బాల్ ఆడుకుంటూ ఎన్నిరకాలుగా బాగుపడొచ్చో. ఇంతకంటే గొప్పవ్యాపారం మరోటి లేదని నా అభిప్రాయం.

మిగతా వ్యాపారాలకి లైసెన్స్‌లు, పెట్టుబడులు కావాలి. యంత్రాలు కొనాలి, సరుకులు కొని అమ్మాలి, ఇక్కడో.... రాష్ట్రాల్ని, దేశాన్ని, జనాల్ని అమ్ముకుంటే చాలు ఏజ్‌బార్ లేదు. రిటైర్మెంటు లేదు, హస్పిటల్‌లో అవసానదశలో వుండి కూడా ఎలక్షన్‌లో గెలవొచ్చు.